క్లుప్తంగా

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

శేరిగూడ సర్పంచ్ మైలారం సత్యనారాయణ

శంకర్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు కలుగుతుందని శేరిగూడ సర్పంచ్ మైలారం సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ తమ ఆరోగ్య సమస్యల పట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేక జాగ్రత్త వహించాలన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రైయివేటు ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితులు దాపురించాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలం మహాలింగపురంలోని తన పొలానికి వేసిన కంచెను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ కోమటిరెడ్డి సురేశ్‌రెడ్డి శనివారం శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలింగపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 631, 632లలో సమారు 29ఎకరాల భూమి ఉందని తెలిపారు. తన పొలం చుట్టూ ఇనుప కంచె వేయించానని పేర్కొన్నారు. ఐనప్పటికీ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు తన పొలానికి వేయించిన ఇనుప కంచెను దౌర్జన్యంగా తొలగించడం బాధాకరమన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

మదాసి కురవ సంఘం నూతన కమిటీ ఏర్పాటు



మదాసి కురవ సంఘం మండల కమిటీ

కొందుర్గు: మదాసి కురవ సంఘం జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షుడు వితలయ్య తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా పెద్ద మల్లన్న, ఉపాధ్యక్షుడిగా మహేందర్, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్, సంయుక్త కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా బాలరాజు, గౌరవాధ్యక్షుడిగా గోపాల్, రమేశ్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదాసి కురవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాములు, జిల్లా కన్వీనర్ ఎమ్మె సత్తయ్య హాజరయ్యారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం



చేవెళ్లలో దుర్గామాత పూజలకు సిద్ధం చేసిన మండపం

చేవెళ్ల: నేటి నుంచి ప్రారంభంకానున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పూజించేందుకు ప్రత్యేకంగా మండపాలు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రులు చేయటం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగానే చేవెళ్ల, మల్కాపూర్, దామరగిద్ద, పామెన తదితర గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలకోసం ప్రత్యేకంగా మండపాలను సిద్ధం చేశారు.

వైభవంగా పల్లకీ సేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగుట్ట లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో శనివారం వైభవంగా అమావ్యాస పల్లకీ సేవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు ప్రత్యేక పూజులు చేసి.. ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు.

కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు సర్పంచ్‌ల సంఘం జిల్లా బూడిద రాంరెడ్డి, ఎంపీపీ కృపేశ్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు పిలుపునిచ్చారు. శనివారం రాయపోల్, కర్ణంగూడ, ముకునూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిని నాలుగోసారి గెలిపిస్తే అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నియోజకవర్గం నిలుస్తుందన్నారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిన ఘనత కిషన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశాల్లో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు బాలుగైడ్, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గణేశ్, జగన్నాథం, ప్రవీణ్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్, సర్పంచ్ బలవంత్‌రెడ్డి, ఎంపీటీసీలు జ్యోతి, శ్రీశైలం, ఉపసర్పంచ్ బాల్‌రాజ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఈశ్వర్, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.



వాడవాడలో బతుకమ్మ

'చిత్తుచిత్తుల బొమ్మ శివుని ముద్దుల బొమ్మ' వాడవాడలో బతుకమ్మ సంబరాలు కనువిందు చేస్తున్నాయి. మహిళలు దసరా పండుగకు ఆహ్వానం పలుకుతూ తీరొక్క పూలతో ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో సద్దుల బతుకమ్మ ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో మహిళా ఉపాధ్యాయులు వివిధ రకాల పూలతో బతుకమ్మ పేర్చి పాటలు పాడుతూ కోలాటం ఆడారు.



చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంబరాల్లో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు



మొయినాబాద్: కోలాటం ఆడుతున్న మహిళా ఉపాధ్యాయులు



చేవెళ్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, విద్యార్థులు



షాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మొయినాబాద్ రూరల్: బతుకమ్మలకు పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రాఘవరెడ్డి



మొయినాబాద్: బతుకమ్మతో ప్రాంతీయ సమన్వయ అధికారి శారద వెంకటేశ్

ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం

- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేస్తూ శనివారం షాద్‌నగర్ శివారులోని బైపాస్ జాతీయ రహదారిపై కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం, సీపీఐ నేతలు సడక్ బంద్ నిర్వహించారు. జాతీయ రహదారిపై నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ విద్యార్థిని ప్రవల్లికది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్యేనని ఆరోపణచేశారు. రెండుసార్లు గ్రూప్–2 పరీక్షలు వాయిదా పడటంతో ఆమె ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో పరీక్షలు రద్దయ్యాయని అన్నారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే రద్దు చేసి, నిబంధనల ప్రకారం కొత్త సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డీఎస్సీ పోస్టులను 13,500లకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పానుగంటి పర్వతాలు, రాజు, రఘు, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, దొడ్డి శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, సుధీర్, ఈశ్వర్‌నాయక్, శ్రీను నాయక్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న అఖిల పక్షాల నేతలు

క్రీడలతో మానసిక ప్రశాంతత

- మెథడిస్ట్ సంఘం జిల్లా సూపరింటెండెంట్ విజయరత్నం

మొయినాబాద్: క్రీడలతో మానసిక ప్రశాంతత, శరీర దారుఢ్యంతో పాటు స్నేహభావం పెరుగుతుందని మెథడిస్ట్ సంఘం జిల్లా సూపరింటెండెంట్ బి.విజయరత్నం అన్నారు. మొయినాబాద్‌లోని మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా పరిధిలో 29 సంఘాల నుంచి పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌సీ యూత్ డైరెక్టర్ ఇమ్మానుయేల్, మెథడిస్ట్ ఫెలోషిప్ ప్రణయ్‌కుమార్, యూత్ వైస్ ప్రెసిడెంట్ నందు, కార్యదర్శి కిషోర్, దీపక్, నిఖిత, లూలా, నిషిత, రాహుల్, ప్రణీత్, దీపిక, ప్రభుచరణ్ తదితరులు పాల్గొన్నారు.



కొందుర్గు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాజేష్ పటేల్

కొందుర్గులో..

కొందుర్గు: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలో ప్రీమీయర్ లీగ్ సీజన్ జేబీపీఎల్–3 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, మహేందర్, శ్రీను, రమేష్, ప్రభాకర్, వాసూరి, రాజు పాల్గొన్నారు.

కనకమామిడి వేంకటేశ్వర స్వామికి పూజలు



కనకమామిడి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గోమాతకు పూజలు నిర్వహించి పండ్లు తినిపిస్తున్న గురు స్వామి గుంటి వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: శనివారం అమావాస్య కావడంతో కనకమామిడి సమీపంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ గ్రామాలతో పాటు జంట నగరాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు, అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కొండ లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయ దర్శనార్థం వస్తున్న భక్తులకోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం మొయినాబాద్ మండల అయ్యప్ప స్వాముల గురుస్వామి రాంచందర్, వెంకట్‌రెడ్డి, కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ 'అమావాస్య శనివారం' కావడంతో గోమాతలను పూజించడం మూలాన పిత్ర దోహం తొలగుతుందన్నారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత

చేవెళ్ల: రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మానవత్వంతో స్పందించి శనివారం దాత కావడి తిరుపతిరెడ్డి సీసీతో గుంతను పూడ్చివేయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్ల మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, సీపీఐ కాలనీకి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. దీంతో నిత్యం ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతనిధులు, నాయకులు వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కావడి తిరుపతి రెడ్డి స్పందించి ప్రత్యేకంగా రెడిమిక్స్ ట్యాంకర్‌ను తెప్పించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. దీంతో ఆయన చేసిన మంచి పనిపై చేవెళ్ల సోషల్ మీడియా గ్రూప్ ద్వారా గ్రామప్రజలు, నాయకులు, అధికారులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.



సీసీతో మరమ్మతు చేయించిన తిరుపతిరెడ్డి

నేడు వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: శ్రీ సత్యసాయి సేవా సంస్థ మొబైల్ వ్యాన్ వైద్య శిబిరాన్ని ఇబ్రహీంపట్నంలోని కేపీ తండాలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సభ్యులు చంద్రశేఖర్ తెలిపారు. ఈ శిబిరం ఉ.8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నిర్వహిస్తామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఉ. 8 గంటలకు ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బాధితుడికి పరామర్శ

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామానికి చెందిన రవీందర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దాడిచేసి గాయపరిచారు. విషయం తెలియడంతో శనివారం ఉదయం రవీందర్‌ను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

యాచారం: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని, చేతి గుర్తుకే ఓటేయాలని నక్కర్తమేడిపల్లిలో శనివారం ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోటె శ్రీశైలం, ఎంఆర్‌ఆర్ యువసేన వర్కింగ్ ప్రెసిడెంట్ ముచ్చర్ల సంపత్‌కుమార్, నాయకులు సంగెం మల్లేష్, జంగయ్య గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ గ్యారంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూములు, ఉద్యోగాలు వచ్చాయని తెలియజేశారు.

ఎస్ఐకి సన్మానం

తలకొండపల్లి: సర్పంచ్‌లు కాడమోని శ్రీశైలం, శ్యాంసుందర్‌రెడ్డి, రమేష్‌యాదవ్‌లు ఎస్ఐ శ్రీనును ఘనంగా సన్మానించారు. తలకొండపల్లి మండల నూతన ఎస్ఐగా శ్రీను ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాలతో సన్మానించారు. పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో ఎంపీటీసీ రఘునాయక్, రాజేందర్‌రెడ్డి, శ్రీశైలం, శ్యాంసుందర్‌రెడ్డి, రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకాశ్ నాయక్

షాద్‌నగర్: సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకాశ్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బాలికల కళాశాల వసతి గృహాన్ని ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆకాశ్ నాయక్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు ఎక్కువగా ఉండే సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. అనంతరం హాస్టల్ వార్డెన్ గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు.



హాస్టల్ వార్డెన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, విద్యార్థులు

కొనసాగుతున్న 'రియల్' దందా



రోడ్డుకు ఇరువైపులా ఉన్న కల్వర్టు పక్కన మట్టిని డంప్ చేస్తున్న టిప్పర్లు

- బాకారంలో మాసని కుంట మాయం
- మూసుకుపోతున్న కల్వర్టులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని బాకారం గ్రామ సమీపంలోని మాసాని కుంట రియల్ ఎస్టేట్ పేరిట వ్యాపారుల దందాలో మాయమైంది. ప్రస్తుతం మాసాని కుంట కింది భాగంలోని కల్వర్టు రోడ్డుకు ఇరువైపుల నీరు వెళ్లే మార్గం ఉంది. దానిని కూడా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు టిప్పర్లతో మట్టి పోసి కాలువను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో అనాథాశ్రమం పక్కన ఉన్న సర్వే నెంబర్ 34లో మాసాని కుంటపైభాగం కొందరు వ్యాపారులు కుంటను మూసి వేయించారు. రైతుల పొలాల నుంచి వచ్చే నీరు కల్వర్టు ద్వారా ఎగువకు పారుతుంది. శాంతి నిలయం పక్కన ఉన్న కల్వర్టును రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు టిప్పర్ల ద్వారా మట్టిని శనివారం సాయంత్రం భారీ ఎత్తున డంప్ చేస్తున్నారు. దీంతో బాకారం గ్రామస్తులు, చుట్టుపక్కల రైతులు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇరిగేషన్ అధికారులు ఉన్నారా? లేరా? అనే సందేహాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్వర్లులను పరిశీలించి రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాన్ని తొలగించొద్దు

అబ్దుల్లాపూర్‌మెట్ : విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్దఅంబర్‌పేటలోని లక్ష్మారెడ్డి పాలెంలో గల అభయాంజనేయస్వామి దేవాలయం, జమ్మి హనుమాన్ ఆలయాలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్న సమాచారంతో వందలాది మంది హనుమాన్ భక్తులు శనివారం ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ఎన్నో ఏళ్లుగా పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి దేవాలయాన్ని రోడ్డు విస్తరణ సాకుతో పూర్తిగా తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాన్ని తొలగించకుండా ఏదైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు ఆలయం ఎదుట నిరసన తెలిపారు.



ఆలయం ఎదుట నిరసన తెలుపుతున్న స్థానికులు



పంటల సాగుపై అవగాహనలో పాల్గొన్న సర్పంచ్ అమృతమ్మ

పంటలపై అవగాహన

షాద్‌నగర్‌రూరల్: వెలిజర్ల గ్రామంలో ఉద్యాన పంటల సాగుపై శనివారం మోజర్ల హార్టికల్చర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన పంటల సాగు, పంటల ప్రాధాన్యత వంటి వాటిపై వివరించారు. పంటల సాగు ఏవిధంగా చేయాలి, తీసుకునే జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. సర్పంచ్ అమృతమ్మ, ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు తిరుపతయ్య, విద్యార్థినులు సాయికీర్తి, కీర్తన, తేజశ్రీ, అఖిల, అపర్ణ, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికావద్దు

షాబాద్ సీఐ యాదయ్యగౌడ్



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



చిన్న సోలిపేట్‌లో సిబ్బందితో పర్యటిస్తున్న సీఐ యాదయ్యగౌడ్, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి

షాబాద్: ప్రజలు ఎవరి ప్రలోభాలకు లొంగొద్దని స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని షాబాద్ సీఐ యాదయ్యగౌడ్, ఎస్ఐ మహేశ్వర్ రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం చిన్న సోలిపేట్, హైతాబాద్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి పర్యటించి పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలను ఎవరైన ప్రలోభాలకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

షాద్‌నగర్‌రూరల్‌లో..

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని మధురాపూర్ గ్రామంలో శనివారం సాయంత్రం షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలోని పురవీధుల గుండా తిరిగారు. ఈ కార్యక్రమంలో డీఐ రాంరెడ్డి, ఎస్ఐలు దేవకి, శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువ ఓటర్లే కీలకం

- నగానికి పైన యువత
- యువకులను ఆకర్షించే పనిలో పార్టీలు

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గంలో యువత ఓట్లే కీలకం కానున్నాయి. అభ్యర్థుల గెలుపోటములను యువ ఓటర్లు నిర్ధారించనున్నారు. నియోజకవర్గంలో 19 నుంచి 39 సంవత్సరాలు వయసు గల ఓటర్లు సగానికి పైగా ఉన్నారు. దీనితో జయాపజయాలను యువ ఓటర్లు శాసించనున్నారని పలువురు విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

మొత్తం ఓటర్లు 2,30,650


కల్వకుర్తిలో మొత్తం ఓటర్లు 2,30,650 మంది ఉన్నారు. మహిళలు 1,13,250 మంది, పురుషులు 1,17,393, థర్డ్ జెండర్ 7 మంది ఉన్నారు. ఇందులో కడ్తాల్ మండలంలో 32,019 మంది ఓటర్లు, తలకొండపల్లి మండలంలో 35,272, కల్వకుర్తి రూరల్‌లో 29,746, కల్వకుర్తి మున్సిపాలిటీలో 23,766, వెల్దండ మండలంలో 31,565, ఆమనగల్లు మండలంలో 29,941, మాడుగుల మండలంలో 41,579, చారకొండ మండలంలో 6,757 మంది ఓటర్లు ఉన్నారు.

యువ ఓటర్లే ఎక్కువ

నియోజకవర్గంలో 18 నుంచి 39 సంవత్సరాలు వయసు ఉన్న ఓటర్లు 1,20,070 మంది ఉన్నారు. ఇందులో 18 నుంచి 19 సంవత్సరాల వారి 6519 మంది ఓటర్లు, 20 నుంచి 29 సంవత్సరాల వారు 46134 మంది ఓటర్లు, 30 నుంచి 39 సంవత్సరాల ఓటర్లు 67417 మంది ఉన్నారు. దీనితో కల్వకుర్తి అసెంబ్లీ బరిలో నిలిచే అభ్యర్థుల భవితవ్యాన్ని యువ ఓటర్లు నిర్ధారించే అవకాశం ఉంది.

ఓటు నమోదుకు అవకాశం

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. నిరంతరం ఓటు నమోదు, బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నెల 4న తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. అయినా కొత్తగా ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. 18 ఏళ్ల నిండినవారు, ఓటరు జాబితాలో చోటు దక్కనివారు ఈ నెల 31 వరకు ఓటు కోసం నమోదు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. మీ సేవా కేంద్రంలో లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఫారం నంబర్ 6ను నింపి ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.



కల్వకుర్తి ముఖచిత్రం